క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సీఐ దాడి చంద్రశేఖర్



మైలవరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం స్థానిక సీడీపీఓ కార్యాలయం సమీపంలోని గ్రామ సచివాలయం-3 వద్ద శుక్రవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 200 మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. లయన్స్ జిల్లా జీఎస్టీ కో–ఆర్డినేటర్ కంచర్ల ముత్య ప్రసాద్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల మస్టర్లలో అక్రమాలు

సామాజిక తనిఖీలో బహిర్గతం



తిరువూరు: గత ఏడాది తిరువూరు మండలంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలను సామాజిక తనిఖీలో గుర్తించారు. సోషల్ ఆడిటర్లు గత నెల రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన తనిఖీల్లో వెల్లడైన పలు అవకతవకలను శుక్రవారం తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో వివరించారు. పనికి హాజరైన కూలీలతో పాటు రాని వారికి కూడా మస్టర్ వేయడం, హాజరులో దిద్దుబాట్లను తనిఖీలో గుర్తించిన ఆడిటర్లు నివేదిక సమర్పించారు. తాము ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేసేందుకు గ్రామాలకు వెళ్లినప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించలేదని పలువురు ఫిర్యాదు చేశారు. డ్వామా పీడీ రాము, తిరువూరు ఎంపీడీఓ రవిబాబు, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీఎం మున్నీ, ఎంపీపీ గద్దల భారతి తదితరులు పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజావేదిక కొనసాగింది.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి



మునుకుళ్ల(తిరువూరురూరల్): వర్షాకాలంలో డెంగీ వ్యాధి బారిన పడకుండా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాజుగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి చలపతిరావు అన్నారు. మునుకుళ్లలో జాతీయ డెంగీ మాసోత్సవాల సందర్భంగా అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజుల తరబడి జ్వరం, తలనొప్పి, ఒళ్లు, కీళ్ల నొప్పులు, అలసట, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దోమల నిర్మూలన, పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రమోహన్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు నివాళి

ఆగిరిపల్లి: మాజీ ముఖ్యమంత్రి దివంగత రోశయ్య జయంతి వేడుకలను ఆగిరిపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య నాయకుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్య వైశ్య నాయకులు చలవాది వెంకటరత్నం, తవ్వా మురళీధర్, జూలూరు చంద్రమౌళీశ్వరరావు, మడుపల్లి రుత్విక్, మిధున్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఇంటింటి ప్రచారం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విద్యుత్ వినియోగదారులకు గుదిబండగా మారిన స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు కొండపల్లి బ్యాంక్ సెంటర్‌లో శుక్రవారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల వలన కలిగే అనర్థాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు, సెకీ ఒప్పందం, టైమ్ ఆఫ్ డే విధానాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు మా ఇంటికి బిగించవద్దనే పోస్టర్లు ప్రదర్శించారు. నాయకులు విఠల్‌రావు, కొండలరావు, ఎస్కే బాషా, ఎల్. పార్వతి, బేబీ, తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల పంపిణీ

మునునూరు: మండలంలో గుడిపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత రాయంకుల రామారావు బస్‌పాస్‌లకు రూ.60 వేలు చెల్లించారు. బస్‌పాస్‌లను శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, దాత రామారావు, సర్పంచ్ ఆర్ శ్రీదేవి పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



తిరువూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టి దేశానికే రోల్ మోడల్‌గా చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన కృషిని కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. తిరువూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమం అందని ద్రాక్షగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాన్ని ఎందుకు రద్దు చేసిందో అర్థంకావడం లేదని చెప్పారు. సంస్కరణల పేరుతో పాఠశాలలను విలీనం చేయడంతో పాటు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రక్రియకు కూటమి పాలకులు శ్రీకారం చుట్టారని విమర్శించారు. తప్పు జరిగితే ప్రశ్నిస్తానని ఎన్నికలకు ముందు ఊదర గొట్టిన పవన్‌కల్యాణ్ మౌనవ్రతం దాల్చారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రారంభించగా, వాటిని ప్రైవేటుపరం చేయడానికి కూటమి పాలకులు నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దీనిని వైఎస్సార్ సీపీ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు.

సంక్షేమానికి మంగళం

రాష్ట్ర ప్రజలకు గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకంటే రెట్టింపు ఇస్తామని ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. కేవలం తల్లికి వందనం మొక్కుబడిగా అమలు చేసి, మిగిలిన పథకాలను ఎప్పటికప్పుడు వాయిదాలు వేస్తూ హామీలన్నీ అమలు చేశామని గొప్పలు చెప్పుకోవడం కూటమి పాలకులకే చెల్లిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి నవీన్, చలమాల సత్యనారాయణ, తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు షేక్ జాకీర్, తిరుమలశెట్టి వేణు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, వాళ్ల సురేష్, యరదేశి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. ఆదివారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై పట్టణంలోని ద్వారకా ఎస్టేట్‌లో సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో నూజివీడు మండలం, పట్టణం నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలతో పాటు 143 హామీలను ఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టి ఏడాది గడిచినా మూడు హామీలను కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కేంద్రియ విశ్వవిద్యాలయం పనుల్లో జాప్యం చేయడం దారుణమన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, పట్టణ, మండల అధ్యక్షులు శీలం రాము, పాలిమెట్ల శివ, వివిధ విభాగాల నాయకులు బాణావతు రాజు, కంచర్ల లవకుమార్, పిళ్లా చరణ్, పాలడుగు విజయ్ కుమార్, బసవా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం ఆదర్శనీయం



గంగినేని జెడ్పీ హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జి.కొండూరు: స్వాతంత్య్రోద్యమంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని గంగినేని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం నారాయణరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- **తిరువూరు:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని గంపలగూడెం మండలం పెనుగొలను షిర్డీ సాయిబాబా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి కమిటీ కన్వీనర్ నారాయణరావు, యువజన విభాగం కన్వీనర్ యజ్ఞకృష్ణ, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై. శ్రీనివాసరావు, సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి పోరాట చరిత్రను వారు విద్యార్థులకు వివరించారు.
- **ఇబ్రహీంపట్నం:** ఎన్టీటీపీఎస్‌లో చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు ఉద్యోగులతో కలిసి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధనలో అల్లూరి సీతారామరాజు చేసిన సాహసం మరువలేనిదన్నారు. వెల్ఫేర్ అధికారి కె.లీల, పలువురు సీనియర్, జూనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.
- **మైలవరం:** మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడు: స్థానిక కృష్ణా యూనివర్సిటీ డాక్టర్ ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌లో శుక్రవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ జె. నవీన లావణ్యలత మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 అధికారులు షేక్ అన్వర్ బాష, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- **విస్సన్నపేట:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలలో అల్లూరి చిత్రపటానికి తహసీల్దార్ కె. లక్ష్మీ కల్యాణి, ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు పూలమాల వేసి నివాళులర్పించారు. డీటీ హేమ ప్రసాద్, సర్వే డీటీ విజయభాస్కర్, ఆర్ఐ సుజాత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికుల ధర్నా

నూజివీడు: ఆర్టీసీలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే కృషి చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ కమిటీ సభ్యులు రంగు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నూజివీడు డిపో గేటు వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వెంటనే ప్రభుత్వం ఉద్యోగోన్నతులు ఇవ్వాలని, పెండింగ్ డీఏ బకాయిలను, 11వ పీఆర్సీకి సంబంధించి 24 నెలల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రీజినల్ కమిటీ సభ్యులు ఎం. గంగాధరరావు, డిపో కార్యదర్శి ఈవీ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ మొబీన్, నాయకులు పాల్గొన్నారు.

- **తిరువూరు:** తమ ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ తిరువూరు డిపోలో ఆర్టీసీ కార్మికులు శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రీజినల్ అధ్యక్షుడు ఎస్. రమేష్ మాట్లాడుతూ ఆర్టీసీలో ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, పాత పద్ధతిలోనే వైద్య సదుపాయం కల్పించాలని, కరువు భత్యం బకాయిలు ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ నిర్వహించాలని కోరారు. యూనియన్ రీజినల్ వైస్ ప్రెసిడెంట్ హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట రామకృష్ణ, డిపో కార్యదర్శి పీకే రెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా రంగా జయంతి వేడుకలు



కొండపల్లిలో వీఎం రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నూజివీడులో నివాళులర్పిస్తున్న ప్రతాప్ అప్పారావు, నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొండపల్లిలో శుక్రవారం జరిగాయి. రంగా విగ్రహానికి వైఎస్సార్ సీపీ మున్సిపాల్టీ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

- **మైలవరం:** మైలవరంలో కాపు సంఘం ఆధ్వర్యంలో స్థానిక రంగా, మదర్ థెరిస్సా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కఠారి ఉమామహేశ్వరరావు, నాగులూరి దుర్గాప్రసాద్, కరెడ్ల వెంకట నారాయణ, తోట తిరుపతిరావు, నుచ్చు పానకాలరావు పాల్గొన్నారు. రెడ్డిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల వైస్ ఎంపీపీ, నాయకులు చాట్ల రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు. మైలవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మైలవరం మూడు బొమ్మల సెంటర్‌లో రంగా జయంతి కార్యక్రమాలు జరిగాయి.
- **ఇబ్రహీంపట్నం:** స్థానిక రింగ్ సెంటర్‌లో రాధా, రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో రంగా చిత్ర పటానికి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారాసు కృష్ణ మోహన్, రాధా, రంగా మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు. కొండపల్లిలో రంగా చిత్రపటానికి డీసీసీ కార్యదర్శి బొర్రా కిరణ్ శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు పాల్గొన్నారు.
- **నూజివీడు:** కాపునేత, మాజీ ఎమ్మెల్యే దివంగత వంగవీటి మోహనరంగా పేదల పక్షపాతి అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ద్వారకా ఎస్టేట్‌లో శుక్రవారం రంగా చిత్రపటానికి ప్రతాప్ అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతాప్ మాట్లాడుతూ రంగా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** స్థానిక వంగవీటి మోహన రంగా విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లి రోడ్డులోని రంగా విగ్రహం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. విగ్రహ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **నూజివీడు:** పట్టణంలోని పెద్దగాంధీబొమ్మ సెంటర్‌లో కాపు నాయకులు రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాధా రంగా మిత్రమండలి నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

నూజివీడు: వైఎస్సార్ సీపీకి చెందిన పలు అనుబంధ విభాగాలకు నియోజకవర్గ స్థాయిలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. యూత్ వింగ్‌కు బసవా రామకృష్ణ, మహిళా విభాగానికి తులిమెల్లి పావనజ్యోతి సుజన కుమారి, రైతు విభాగం అధ్యక్షుడిగా ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా మండాడ శంకరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా భూక్యా కిశోర్ నాయక్‌ను నియమించారు. మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా మీర్ అంజాద్ ఆలీ, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా చెలికాని బాల సత్య ధర్మారావు, సమాచార హక్కు చట్టం వింగ్ అధ్యక్షుడిగా పాలడుగు విజయ్‌కుమార్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా గుర్రం శ్రీనివాసరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గాదెరెడ్డి రంజిత్‌రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా జేడీ గాంధీ, సోషల్ మీడియా సెల్ అధ్యక్షుడిగా వాకా సక్కేశ్వరరావు, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా శీదర్ల శాంతకుమార్ నియమితులయ్యారు.

దుర్గమ్మకు బోనాలు

ఆగిరిపల్లి: వడ్లమానులోని కనకదుర్గమ్మకు బోనాల సమర్పణ శుక్రవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు రాణి మేకల సత్యనారాయణ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం వద్ద మహిళలు బోనాలతో ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

ముగిసిన పునీత థామస్ మహోత్సవాలు

మునునూరు: భారతదేశంలో రోమన్ క్యాథలిక్ వ్యాప్తి కారకుడు, ప్రారంభకుడైన పునీత థామస్ ధన్యజీవి అని, ఆయనను సదా గౌరవించాలని నూజివీడు టౌన్ విచారణకర్త, వికార్ ఫోరెన్ రెవ.ఫాదర్ లాము జయరాజు అన్నారు. రమణక్కపేట విచారణలో రెవ.ఫాదర్ జాన్‌భారతి ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పునీత థామస్ మహోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి.

మహిళ మెడలో బంగారు నానుతాడు చోరీ

మైలవరం: మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన ఘటన కుదప గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగింది. రెడ్డిగూడెం మండలం కుదప గ్రామానికి చెందిన బలగాని జమలమ్మ గ్రామ శివారు బ్రిడ్జి వద్ద గేదెలు మేపుతుండగా బైక్ పై వచ్చిన యువకుడు జమలమ్మ వద్దకు వెళ్ళి తుమ్మలపల్లి రాఘవయ్య పొలం ఎక్కడ అని అడిగాడు. మహిళ పొలం చూపిస్తుండగా ఆమె మెడలోని బంగారు నానుతాడు లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అసైన్డ్ భూములను పేదలకు పంచాలి

ఆగిరిపల్లి: మండలంలో అన్యాక్రాంతమైన అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ పోరంబోకు భూములను పేదలకు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆగిరిపల్లి ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సాక్షాత్తు మంత్రి నియోజకవర్గంలోనే పేదలకు న్యాయం జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

ఆర్డీఓ కావూరి చైతన్య

మైలవరం: మైలవరం–నూజివీడు ఆర్ అండ్ బీ రహదారి విస్తరణలో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆర్డీఓ కావూరి చైతన్య అన్నారు. మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సీపీఎం నాయకులు, బాధితులతో ఆర్డీఓ చైతన్య చర్చించారు. ఆర్డీఓ మాట్లాడుతూ త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు, మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, బాధితులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం



తిరువూరు: స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ బదిలీ అయిన పలువురు ఆరోగ్య సిబ్బందిని శుక్రవారం యూపీహెచ్‌సీ వైద్యాధికారి రేష్మాబేగం ఆధ్వర్యంలో సన్మానించారు. యూపీహెచ్‌సీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఆశాబీ, ఏఎన్ఎం పాదెమ్మ, ఆరోగ్య కార్యదర్శులు కోటేశ్వరి, రమాదేవి, రత్నకుమారి, రాజేశ్వరి, కరుణకుమారిలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. సబ్ యూనిట్ అధికారి బాబావలి, హెల్త్ సూపర్‌వైజర్ రవి, హెల్త్ విజిటర్ శ్యామల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నూజివీడు: ఈ నెల 9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు కోరారు. పట్టణంలోని పెద్దగాంధీబొమ్మ సెంటర్‌లో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం కార్మికులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. సార్వత్రిక సమ్మెలో అసంఘటిత, సంఘటిత కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొనాలని కోరారు. ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు శాకంబరి అలంకరణ



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో ఆషాఢ మాసం సందర్భంగా ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. పలు రకాల కూరగాయలతో అలంకరించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.